సాక్షి కర్నూలు

శుక్రవారం ◆ 22 ◆ సెప్టెంబర్ ◆ 2023



'సుంకేసుల'లో నీటి నిల్వలు

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌లో 1.026 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డ్యాం అధికారులు గురువారం తెలిపారు. ఇన్‌ఫ్లో నిలిచిపోవడంతో దిగువకు నీటి విడుదల నిలిపేశామన్నారు.



ఈరన్నకు భారీ ఆదాయం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామికి భక్తులు హుండీలో సమర్పించిన కానుకలు గురువారం లెక్కించారు. రూ.84,30,289 నగదు సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



మగాడు వెనకడుగు

కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సకు పురుషులు ముందుకు రావడం లేదు. సుఖసంసారానికి ఎలాంటి ఇబ్బంది లేకున్నా అపోహలతో దూరంగా ఉంటున్నారు. 8లో▸

చిరు విప్లవం!

కొర్రలు.. సామలు.. అండుకొర్రలు.. అరికెలు.. ఊదలు.. వరిగ.. ఈ పేర్లు ఒకప్పుడు ప్రతి ఇంట్లో వినిపించినా, కొన్నేళ్ల క్రితం కనుమరుగయ్యాయి. ఆధునిక జీవనశైలితో ఈ పంటలు ఎక్కడో కానీ కనిపించని పరిస్థితి. ఉరుకులు పరుగుల జీవితంలో వ్యాధులు చుట్టుముట్టడంతో జీవితం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. మారిన వాతావరణం, పరిస్థితుల్లో ఆరోగ్యం, ఆహార అలవాట్లపై దృష్టి సారిస్తున్న నేపథ్యంలో సంప్రదాయ పంటలకు ఇప్పుడిప్పుడే ప్రాధాన్యత పెరుగుతోంది. అనారోగ్య సమస్యలను అధిగమించేందుకు సరిధాన్యాల వాడకం అధికమవుతోంది. ప్రభుత్వం కూడా సాగును ప్రోత్సహిస్తూ పెద్ద ఎత్తున సబ్సిడీలు ఇస్తుండటం విశేషం.



ఊదల పంట

పెరుగుతున్న మిల్లెట్ సాగు

- చిరుధాన్యాల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం
- పదేళ్ల క్రితంతో పోలిస్తే 40 శాతంపైగా పెరిగిన వినియోగం
- సాగుకు రూ.82.80లక్షల రాయితీలు
- కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా మిల్లెట్ కేఫ్ నిర్వహణ

కర్నూలు(అగ్రికల్చర్): 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ మిల్లెట్ ఇయర్‌గా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది మిల్లెట్ సాగుకు ప్రోత్సాహం, చిరుధాన్యాల వినియోగాన్ని పెంచడంపై ప్రత్యేక దృష్టి సారించడం విశేషం. అందులో భాగంగా గత ఏడాది ఖరీఫ్‌లో 7,012 ఎకరాల్లో చిరుధాన్యాల పంటలు సాగయ్యాయి. 2023 ఖరీఫ్‌లో చిరుధాన్యాల సాగు 21,825 ఎకరాలకు పెరిగినట్లు తెలుస్తోంది. ధర లేనప్పుడు రైతులు నష్టపోకుండా ప్రభుత్వం మద్దతు ధర కూడా నిర్ణయిస్తోంది. సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేస్తోంది. రాయితీతో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తోంది. పదేళ్ల క్రితం చిరుధాన్యాల వినియోగం 10 శాతం వరకు ఉండగా.. మారుతున్న పరిస్థితులతో వీటి వినియోగం 40–50 శాతం పైగా పెరిగింది.

చిరుధాన్యాల సాగుకు చేయూత

- ఆహార, పోషక భద్రత(ఫుడ్ అండ్ న్యూట్రీషియన్ సెక్యూరిటీ) కింద కొర్ర, సజ్జ, జొన్న, వరిగ సాగును ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేస్తున్నారు. 3,450 ఎకరాలకు ప్రభుత్వం రూ.82.80 లక్షల విలువైన ఇన్‌పుట్స్ సరఫరా చేస్తోంది.
- రూ.1.25 లక్షల సబ్సిడీతో ఏడు మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు. వీటికి అదనంగా వర్షాధార ప్రాంత అభివృద్ధి కింద రూ.2 లక్షల సబ్సిడీతో దాదాపు 15 మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటవుతున్నాయి. ఇప్పటికే కర్నూలు, నంద్యాల తదితర ప్రాంతాల్లో ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు కావడం విశేషం. షాపింగ్ మాల్స్ సిరిధ్యాన్యాలను ప్రత్యేకంగా విక్రయిస్తున్నాయి. వరి బియ్యంతో పోలిస్తే మిల్లెట్ రైస్ ధరలు కూడా ఎక్కువే. కిలో అండుకొర్రల(వాక్యుమ్ ప్యాకింగ్) ధర రూ.289 పలుకుతోంది.



25 ఎకరాల్లో చిరుధాన్యాల సాగు

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడం లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ విత్తన రైతు సేవా సంఘాన్ని ఏర్పాటు చేశాం. కొర్రలు, సామలు, ఊదలు, అరికలు, అండుకొర్రలు 25 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసు చేసున్నాం. పంటను ఆంధ్రప్రదేశ్ విత్తన రైతు సేవా సంఘం ద్వారా కొనుగోలు చేస్తాం. ఇప్పటికి చిరుధాన్యాల ప్రాసెసింగ్ సెంటర్ కూడ ఏర్పాటు చేశాం. కలెక్టరేట్ ప్రాంగణంలో మిల్లెట్ కేఫ్ కూడా నిర్వహిస్తున్నాం.

– వేణుబాబు, చిరుధాన్యాల రైతు



చిరుధాన్యాల బ్రెడ్

అరికల లడ్డు

వ్యాక్యూమ్ ప్యాకింగ్‌లో అండుకొర్రల ప్యాకెట్

మిల్లెట్ కేఫ్‌కు విశేష స్పందన

సిరిధాన్యాలు పోషకాలను అందించడమే కాకుండా రోగ కారకాలను శరీరంలో నుంచి తొలగించి దేహాన్ని శుద్ధి చేస్తాయి. ఈ నేపథ్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ విత్తన రైతు సేవా సంఘం ఏర్పాటు చేసిన మిల్లెట్ కేఫ్‌కు విశేషమైన స్పందన లభిస్తోంది. రోజు 160 మందికి పైగా మిల్లెట్ కేఫ్‌ను సందర్శిస్తున్నారు. ఇక్కడ చిరుధాన్యాల అన్నం, మిక్చర్, మురుకులు, లడ్డు, బిస్కెట్లు, చిరుధాన్యాల ఇడ్లీరవ్వ లభిస్తాయి. చిరుధాన్యాల బ్రెడ్‌కు ప్రత్యేక ఆదరణ ఉంటోంది.

సిరిధాన్యాల విశిష్టత

తక్కువ నీటితో రసాయన ఎరువులు, పురుగుమందుల అవసరం లేకుండా పండగలిగిన అత్యుత్తమ పోషక విలువలు కలిగిన పంటలు సిరిధాన్యాలు. మూడుపూటలా తిన్నప్పుడు, ఆ రోజుకు మనిషికి అవసరమైన పీచుపదార్థం (ప్రతి ఒక్కరికి రోజుకు 38 గ్రాముల పీచుపదార్థం కావాలి) ఈ ధాన్యాల నుంచే లభిస్తుంది. తక్కిన 10 గ్రాములు కూరగాయలు, ఆకు కూరల నుంచి పొందవచ్చు.

2022, 2023 ఖరీఫ్‌లో చిరుధాన్యాల సాగు

చిరుధాన్యాల పంట	2022	2023 (ఎకరాల్లో)
కొర్రలు	1,472	3,155
సజ్జ	4,726	14,405
జొన్న	468	3,748
అండుకొర్రలు	158	228
ఊదలు	36	68
వరిగలు	26	49
రాగులు	126	172
మొత్తం	7,012	21,825

బీపీ, షుగర్ తగ్గాయి



నాకు 79 ఏళ్లు. గతంలో ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది. బీపీ, షుగర్ కూడా ఉండింది. బరువు 65 కిలోలు. ఏడాదిన్నరగా కేవలం సిరి ధాన్యాలైన సామలు, అరికలు, అప్పుడప్పుడు ఊదల ఆహారం తీసుకుంటున్నా. వీటికి తోడు జొన్న రొట్టె తింటున్నా. ప్రస్తుతం ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవు. బీపీ, షుగర్ కంట్రోల్‌లో ఉన్నాయి.

– పిచ్చిరెడ్డి, విశ్రాంత ఏడీఏ, వెంకటరమణ కాలనీ, కర్నూలు

చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నాం



రాష్ట్ర ప్రభుత్వం చిరుధాన్యాలకు మద్దతు ధర ప్రకటించింది. ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తోంది. ఈ పంటల సాగులో పెట్టుబడి వ్యయం తక్కువగా ఉంటుంది. రసాయన ఎరువులు వాడాల్సిన అవసరం ఉండదు. డయాబెటిస్ తదితర వ్యాధులకు చిరుధాన్యాల ఆహారం దివ్య ఔషధం. గతంతో పోలిస్తే ఈ ఏడాది మిల్లెట్ సాగు భారీగా పెరుగుతోంది.

– పీఎల్ వరలక్ష్మి, డీఏఓ, కర్నూలు

న్యూస్‌రీల్

వినాయకుడికి నాణేల హారం



పాణ్యం: మండల పరిధిలోని కొణిదేడు గ్రామంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి నిర్వాహకులు వినూత్నంగా నాణేల హారం వేశారు. పూలవ్యాపారులతో లిల్లి, బంతి పూల దండలోనే అక్కడక్కడా నాణేలను అమర్చి దండను తయారు చేయించారు. రూ.1,500 విలువ చేసే నాణేలు దండలో వాడినట్లు నిర్వాహకులు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



ఈ.పద్మావతి

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్‌గా ఈ.పద్మావతి గురువారం బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు జిల్లా జేఎన్‌వీ వైస్ ప్రిన్సిపాల్ ఈ.పద్మావతికి ప్రిన్సిపాల్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో ఆమె బాధ్యతలు స్వీకరించారు. విద్యాలయంలో అందరి సహకారంతో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఆమె తెలిపారు. ప్రిన్సిపాల్‌కు విద్యాలయ అధ్యాపక బృందం పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

క్వింటా కందులు రూ.10,500

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ధరలు పురోగమనంలో ఉన్నాయి. కందుల ధర ఏకంగా రూ.10,500లకు చేరుకుంది. గురువారం మార్కెట్‌కు కందులు కేవలం ఒక్కలాట్ మాత్రమే వచ్చింది. దీనికి రికార్డు స్థాయిలో రూ.10,500 ధర లభించడం విశేషం. మినుముల ధర కూడా మెరగ్గానే ఉంది. రెండు లాట్లు రాగా.. ఒక లాట్‌కు రూ.6,650, మరో లాట్‌కు రూ.8,280 ప్రకారం ధరలు లభించాయి. ఉల్లి గడ్డలు మార్కెట్‌కు 12 లాట్లు అంటే 615 క్వింటాళ్లు వచ్చింది. కనిష్ట ధర రూ.1,689 ఉండగా.. గరిష్ట ధర రూ.2,304 లభించింది. మొక్కజొన్న ధర పెరుగుతోంది. మార్కెట్‌కు ఒక్కలాట్ మాత్రమే(25 క్వింటాళ్లు) వచ్చింది. దీనికి రూ.2,111 ధర లభించడం విశేషం. వేరుశనగ ధర కాస్త తగ్గింది.

భూహక్కు పత్రాలు పంపిణీ చేస్తాం

- భూపరిపాలన ప్రధాన కార్యదర్శికి వివరించిన కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): రీసర్వేలో భాగంగా రెండో విడతలో పెండింగ్‌లో ఉన్న భూ హక్కు పత్రాలను శనివారం నాటికి పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ జి.సృజన భూపరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాదుకు వివరించారు. గురువారం ఆయన విజయవాడ నుంచి రీసర్వేపై కలెక్టర్లు, జేసీలతో సమీక్షించారు. రెండో దశలో సర్వే పూర్తయిన గ్రామాలకు సంబంధించిన రైతులకు వెంటనే భూ హక్కు పత్రాలను పంపిణీ చేయాలని ఆదేశించారు. మరోవైపు డిసెంబర్ 31వ తేదీలోపు సరిహద్దు రాళ్లను నాటి రీసర్వేను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో మధుసూదన్‌రావు, సర్వే అధికారులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్ల గడువు పెంపు

కర్నూలు సిటీ: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా 2023–24 విద్యా సంవత్సరానికి ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల గడువును ఈ నెల 30వ తేదీ వరకు పెంచినట్లు డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉండి 14 ఏళ్ల వయస్సు కలిగిన వారు 10వ తరగతికి, 15 ఏళ్ల వయస్సు నిండి టెన్త్ పాసైన వారు ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు అర్హులన్నారు. మరింత సమాచారం కోసం www.apopenrchoo.ap.gov.in వెబ్‌సైట్‌లో కానీ, సమీపంలోని స్టడీ సెంటర్‌ను కానీ సంప్రదించాలన్నారు.

అర్హులకు జగనన్న 'చేదోడు'

కర్నూలు(అర్బన్): జిల్లాలో అర్హులైన కుల వృత్తుల వారందరికీ జగనన్న చేదోడు (రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లు) పథకం కింద ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ నాగేశ్వరరావు చెప్పారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ పథకం అమలుకు సంబంధించి అనర్హులను తొలగించి, అర్హులైన లబ్ధిదారులందరికి అందించాలని జీఎస్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు డైరెక్టర్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ నేపథ్యంలోనే కార్యాలయ సిబ్బంది, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు గ్రామ/వార్డు సచివాలయాలను సందర్శించి అర్హులను గుర్తించి, అనర్హులను తొలగించాల్సి ఉందన్నారు.

మండలాల వారీగా రీ సర్వే లక్ష్యాలను సాధించండి

- 23వ తేదీలోపు స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ పూర్తి కావాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సృజన

కర్నూలు(అర్బన్): రీ సర్వేకు సంబంధించి మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని, పెండింగ్‌లో ఉన్న స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియను ఈ నెల 23వ తేదీలోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్‌ఓ, గ్రామ సర్వేయర్లతో రీ సర్వే అంశంపై సమీక్ష నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ మధుసూదన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు మొదటి విడతలో 60, రెండవ విడతలో 18 గ్రామాల పరిధిలోని భూములను రీ సర్వే పూర్తయిందన్నారు. మూడో విడత కింద 160 గ్రామాల పరిధిలోని భూములను రీ సర్వే చేయాల్సి ఉందన్నారు. ప్రతిరోజూ మండల స్థాయి సిబ్బంది ఫీల్డ్‌లో ఉన్నారా, లేదా అని పరిశీలించాలన్నారు. ఎవరైనా సెలవులో ఉంటే వెంటనే ఇన్‌చార్జ్‌లను నియమించి పనులు పూర్తి చేసేలా చూడాలని కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ నాగ ప్రసన్నలక్ష్మిని ఆదేశించారు. జేసీ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న భూ హక్కు పత్రాలను త్వరితగతిన పంపిణీ చేయాలన్నారు. గ్రౌండ్ ట్రూథింగ్‌కు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా అసైన్డ్‌మెంట్ రివ్యూ కమిటీ కొత్తగా గుర్తించిన లబ్ధిదారుల వివరాలను వెంటనే అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. సమీక్షలో సర్వే ఏడీ విజయసారధి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ న్యాయ విభాగం ఇన్‌చార్జీల నియామకం



మిరపకాయల ప్రభాకర్, జోనల్ ఇన్‌చార్జ్



పి.సువర్ణారెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్షుడు



కె.రామసుబ్బయ్య, నంద్యాల జిల్లా అధ్యక్షుడు

కర్నూలు(రాజ్‌విహార్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ న్యాయ విభాగం (లీగల్ సెల్) జోనల్ ఇన్‌చార్జ్, జిల్లా అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వీరిని నియమించినట్లు పేర్కొంది. జోనల్ ఇన్‌చార్జ్‌గా మిరపకాయల ప్రభాకర్, కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా పి.సువర్ణారెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా కె.రామసుబ్బయ్యలను నియమించారు.

మాంసం దుకాణాలకు లైసెన్స్‌లు తప్పనిసరి

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో జంతువులు, పశువులు, కోళ్లు, చేపల మాంసాన్ని విక్రయించే వ్యాపారులు తప్పనిసరిగా ఆహార నియంత్రణ విభాగం నుంచి లైసెన్సులు తీసుకోవాలని ఆ శాఖ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కూర్మా నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 90 శాతానికి పైగా మాంసం దుకాణాదారులు లైసెన్సులు లేకుండా విక్రయాలు జరుపుతున్నారని, ఇది చట్ట విరుద్ధమన్నారు. ఆహార పదార్థాలు ఏవి విక్రయించినా తప్పనిసరిగా తమ శాఖ వద్ద లైసెన్సులు తీసుకోవాలన్నారు. లైసెన్సులు లేనివారిపై దాడులు నిర్వహించి జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు.

నేటి నుంచి వేరుశనగకాయల టెండర్ల నిలిపివేత



ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వేరుశనగకాయల టెండర్లు శుక్రవారం నుంచి నిలిపేశామని, రైతులు యార్డుకు వేరుశనగకాయలు తీసుకురావద్దని యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేరుశనగకాయల వ్యాపారస్తులకు, హమాలీల మధ్య కూలీ విషయంలో చర్చలు విఫలమయ్యాయన్నారు. ఈ మేరకు వేరుశనగ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు శరణప్ప, అస్లాంబాషా వినతి పత్రం అందజేశారన్నారు. అందువల్ల వేరుశనగ రైతులు తాము చెప్పే వరకు యార్డుకు వేరుశనగ దిగుబడులు తీసుకురావద్దని పేర్కొన్నారు.

24 నుంచి వందేభారత్ రైలు

- బుధవారం మినహా ప్రతి రోజు కర్నూలు సిటీ స్టేషన్ మీదుగా రాకపోకలు



కర్నూలు(రాజ్‌విహార్): వందే భారత్ రైలు ఈ నెల 24 నుంచి కర్నూలు సిటీ స్టేషన్ మీదుగా రాకపోకలు సాగించేందుకు గ్రీన్ సిగ్నల్ లభించింది. అందులో భాగంగా గత ఆగస్టు 9న ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించారు. కాచిగూడ(హైదరాబాద్) స్టేషన్ నుంచి యశ్వంత్‌పూర్ (బెంగుళూరు)కు కర్నూలు సిటీ స్టేషన్ మీదుగా రాకపోకలు సాగించనున్న ఈ రైళ్లు బుధవారం మినహా ప్రతి రోజూ నడుస్తాయి. కర్నూలు సిటీ స్టేషన్‌లో కేవలం ఒక నిమిషం మాత్రమే నిలిపేందుకు అనుమతి ఇచ్చారు. అయితే తొలి రోజు 24న ప్రారంభోత్సవం సందర్భంగా ఈ రైలు కాచిగూడలో మధ్యాహ్నం 12:30గంటలకు బయలుదేరి కర్నూలుకు సాయంత్రం 4:15గంటలకు, డోన్‌కు 5:35గంటలకు చేరుకుంటుంది. మిగిలిన రోజుల్లో రెగ్యులర్ సమయాల్లోనే రాకపోకలు సాగిస్తాయని రైల్వే అధికారులు పేర్కొన్నారు. భారతదేశంలో అత్యంత వేగంగా నడిచే రైళ్లలో వందే భారత్ రైలు ఒకటి. పట్టాల పటిష్టత (ట్రాక్ కండీషన్)ను బట్టి ఈ రైలు గంటకు 160కిలో మీటర్ల వేగంతో నడుస్తుంది.

- కాచిగూడ నుంచి ఉదయం 5:30 గంటలకు బయలుదేరే ఈ రైలు (నంబర్ 20703) కర్నూలు సిటీ స్టేషన్‌కు 8:39కి, డోన్‌కు 9:30కి, యశ్వంత్‌పూర్‌కు మధ్యాహ్నం 2గంటలకు చేరుకుంటుంది.
- తిరిగి యశ్వంత్‌పూర్‌లో మధ్యాహ్నం 2:45గంటలకు బయలుదేరి (నంబర్ 20704) డోన్‌కు రాత్రి 7:15కి, కర్నూలు సిటీ స్టేషన్‌కు 7:50కి, కాచిగూడకు 11:15గంటలకు చేరుకుంటుంది.

ఏషియన్ గేమ్స్‌కు కర్నూలు క్రీడాకారుడు



శివకుమార్

కర్నూలు (టౌన్): ఈనెల 23 నుంచి వచ్చే నెల 8 వ తేదీ వరకు చైనాలోని హంగ్‌జో నగరంలో నిర్వహించనున్న 19వ ఏషియన్ గేమ్స్ (ఆసియా క్రీడలు) సెపక్‌తక్రా చాంపియన్‌షిప్ పోటీలకు కర్నూలు క్రీడాకారుడు శివకుమార్ ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి భారత జట్టులో చోటు సంపాదించుకున్నాడని సెపక్‌తక్రా సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు గురువారం విలేకరులకు తెలిపారు. ఇప్పటికే భారత జట్టు 40 రోజుల పాటు థాయ్‌లాండ్‌లో, 30 రోజుల పాటు ఢిల్లీలో శిక్షణ పూర్తి చేసుకుందన్నారు. శిక్షణలో రాటుదేలిన సభ్యులను ఫైనల్ జట్టులో చోటు కల్పించారని, అందులో జిల్లా క్రీడాకారుడు శివకుమార్ ఉండటం గర్వకారణమన్నారు. అనంతరం సెపక్‌తక్రా సంఘం ప్రతినిధులు, క్రీడా సంఘాల ప్రతినిధులు శివకుమార్‌కు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

పంచాయతీల్లో పక్కాగా 'లెక్క'

- ఈ– గ్రామ్ స్వరాజ్‌తో అవకతవకలకు చెక్
- జిల్లాలో 305 గ్రామ పంచాయతీల్లో అమలు
- వివరాలు ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు
- ఆన్‌లైన్‌లో చేపట్టిన పనులు, నిధుల వ్యయం వివరాలు
- పారదర్శకంగా ఆడిట్ నిర్వహణ

కర్నూలు(అర్బన్): గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధులు పక్కదారి పట్టకుండా, దుర్వినియోగం కాకుండా పారదర్శకత కోసం ఈ– గ్రామ్ స్వరాజ్ యాప్ అమల్లోకి వచ్చింది. ఈ యాప్‌లో నమోదు చేస్తున్న వివరాలతో అవకతవకలకు చెక్ పడనుంది. పంచాయతీల పాలనా వ్యవహారాల్లో పారదర్శకత, ప్రజలు సులభంగా అన్ని విషయాలు తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ యాప్‌ను అమల్లోకి తీసుకువచ్చింది. ఇప్పటి వరకు పంచాయతీ పాలకవర్గాలు చేస్తున్న నిధుల వ్యయానికి సంబంధించిన వివరాలను తెలుసుకునేందుకు సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకుంటున్నారు. ఈ చట్టం మంచిదే అయినా, అడిగిన సమాచారం తీసుకునేందుకు కొంత సమయం పడుతోంది. ఈ నేపథ్యంలోనే ... అడిగిందే తడవుగా క్షణంలో ఏ గ్రామ పంచాయతీ వివరాలు కావాలంటే (నిధులు, వ్యయం తదితరాలు) ఈ యాప్ ద్వారా తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడింది. గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు పన్నుల రూపంలో కొంత నిధి జమ అవుతోంది. ఈ నిధుల్లో 25 శాతం పారిశుధ్య నిర్వహణ, మరో 25 శాతం తాగునీటి సరఫరా, విద్యుత్ బిల్లుల చెల్లింపు, మిగిలిన 50 శాతం నిధులను పంచాయతీ నిర్వహణ, వివిధ అభివృద్ధి పనులకు వెచ్చించుకునే సౌలభ్యం ఉంది.

305 గ్రామ పంచాయతీల్లో అమలు

జిల్లాలో మొత్తం 484 గ్రామ పంచాయతీలు ఉండగా, ఇప్పటి వరకు 305 గ్రామ పంచాయతీల్లో ఈ-గ్రామ్ స్వరాజ్ యాప్ అమల్లో ఉంది. ఈ నేపథ్యంలోనే యాప్ అమల్లో ఉన్న గ్రామ పంచాయతీలకు సంబంధించి విడుదలైన నిధులు, పన్నుల రూపంలో వసూలైన మొత్తాలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు చేస్తున్న వ్యయం తదితర వివరాలను సంబంధించి పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ వల్ల ఆడిట్ నిర్వహణ కూడా సక్రమంగా జరిగే అవకాశం ఏర్పడుతోంది. గతంలో పంచాయతీల్లో నిర్వహించే ఆడిట్‌లో పలు అభ్యంతరాలు వెలుగు చూసేవి. ప్రస్తుతం అభ్యంతరాలకు తావులేకుండా అన్ని వివరాలు యాప్‌లో పొందుపరుస్తున్నారు. అలాగే ప్రతి గ్రామ పంచాయతీలో జరిగే అభివృద్ధి పనులకు చెల్లించాల్సిన బిల్లులు కూడా వెండర్స్‌కు ఇచ్చిన కోడ్ నంబర్ల ఆధారంగా పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (పీఎఫ్ఎంఎస్) ద్వారా జరుగుతున్నాయి.



జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం

15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 31.24 కోట్లు

ఈ ఏడాది జూలైలో జిల్లాలోని 484 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు మొత్తం రూ.31,24,52,342 విడుదలయ్యాయి. ఇందులో ఏపీఎస్‌పీడీసీఎల్‌కు రూ.10,22,10,463, ఈఈఎస్‌ఎల్‌కు రూ.4,28,23,318లను సర్దుబాటు చేశారు. మిగిలిన రూ.16,74,18,561లను అన్ని గ్రామ పంచాయతీల ఖాతాల్లో ఇప్పటికే జమ చేశారు. అలాగే పన్నులు, పన్నేతరముల రూపంలో ఈ ఏడాది మార్చి వరకు అన్ని గ్రామ పంచాయతీల్లో రూ.17.69 కోట్లు వసూలయ్యాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు, పన్నులు, పన్నేతరముల నుంచి ఆయా గ్రామ పంచాయతీల ఖాతాలకు జమ అయిన మొత్తాలకు సంబంధించిన వివరాలతో పాటు ఖర్చులు (జీతభత్యాలు, పంచాయతీల నిర్వహణ) కూడా ఈ-గ్రామ స్వరాజ్ యాప్‌లో నమోదు చేయడం వల్ల ఆర్థికపరమైన అంశాల్లో పారదర్శకత కొనసాగుతోంది.

జవాబుదారీతనం పెరుగుతోంది



గ్రామ పంచాయతీల్లో ఈ – గ్రామ స్వరాజ్ యాప్ ఏర్పాటు చేసుకోవడం వల్ల ఆర్థిక పరమైన అంశాలపై జవాబుదారీతనం పెరుగుతోంది. గ్రామ పంచాయతీలకు విడుదలయ్యే నిధులు దుర్వినియోగం అయ్యే ఆస్కారం లేదు. అవసరమైతే గ్రామ పంచాయతీ అభివృద్ధి, నిర్వహణకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. లేని పక్షంలో పంచాయతీ ఖాతాలో లెక్క పక్కాగా ఉంటుంది. ఇప్పటికే ఈ యాప్ నిర్వహణకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులకు అవగాహన ఉన్నందున అన్ని వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు.

– టి.నాగరాజునాయుడు, జిల్లా పంచాయతీ అధికారి, కర్నూలు

క్లుప్తంగా

కోలుకోలేక వ్యక్తి మృతి


శ్రీనివాసులు మృతదేహం

కర్నూలు: అప్పులు తీర్చే దారిలేక ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి కోలుకోలేక గురువారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కల్లూరులోని కురువ వీధిలో నివాసముంటున్న కురువ శ్రీనివాసులు (42), సుజాత దంపతులకు కుమారుడు, ముగ్గురు కూతుళ్లు సంతానం. శ్రీనివాసులు హమాలీ పనిచేస్తుండగా సుజాత కూలీ పని చేస్తూ భర్తకు చేదోడుగా ఉంటోంది. ఈక్రమంలో పెద్ద కూతురు రేవతికి 20 రోజుల క్రితం దాదాపు రూ.5 లక్షల అప్పు చేసి వివాహం జరిపించారు. కుమారుడు వేణు చదువు మానేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. పనికి వెళ్లమని చెప్పినా వినకుండా ఆవారాగా తిరుగుతుండటంతో కూతురి పెళ్లికి చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియక ఈనెల 18న బాత్‌రూమ్‌లో పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక అర్ధరాత్రి మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నాల్గవ పట్టణ పోలీసులు తెలిపారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

పాములపాడు: కంబాలపల్లి గ్రామంలో గురువారం పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. గ్రామానికి చెందిన తొమ్మిది ఏళ్ల బాలుడు సాంబశివుడు, పాణ్యం కృష్ణుడు, లక్ష్మిరెడ్డి, చాకలి రమణమ్మను కరిచింది. అలాగే పలు గేదెలపై కూడా దాడి చేసింది. పిచ్చికుక్క భయంతో గ్రామస్తులు బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. చేసేదేమీ లేక ప్రతి ఒక్కరూ కర్ర పట్టుకుని తిరుగుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

మగాడు వెనకడుగు!

కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సకు ముందుకు రాని పురుషులు

- మూడేళ్లలో వేసక్టమి చేయించుకున్న మహానుభావులు ఏడుగురే..
- సుఖసంసారానికి ఎలాంటి ఇబ్బంది లేకున్నా అపోహలతో దూరం
- ఒకరో ఇద్దరో అంగీకరించినా పురుషాధిక్యాన్ని గుర్తు చేసి వెనక్కులాగుతున్న కుటుంబ సభ్యులు
- నెలసరి, ప్రసవంతో పాటు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలతో క్షీణిస్తున్న మహిళల ఆరోగ్యం

➢ గూడూరుకు చెందిన సుంకులమ్మ భర్తతో కలిసి వ్యవసాయ కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తోంది. ఆమెకు ఇటీవలే ప్రసవం అయ్యింది. ఇక ఇద్దరు పిల్లలు పిల్లలు చాలనుకుని కుటుంబ నియంత్రణ చేయించుకోవాలని భావించింది. ఏఎన్ఎంలు ఆమె ఇంటి వద్దకు వెళ్లి మగవారు కూడా కు.ని ఆపరేషన్ చేయించుకోవచ్చని, ఎలాంటి ఇబ్బందీ ఉండదని చెప్పారు. కానీ మగవారికి చేస్తే శక్తి తగ్గిపోతుందట కదా అని ఆమే ఆపరేషన్ చేయించుకుంది.

➢ కౌతాళం మండల కేంద్రానికి చెందిన మరియమ్మ కూరగాయల వ్యాపారం చేస్తుండగా భర్త ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. ఆమె ఇటీవలే మగబిడ్డను ప్రసవించింది. మూడు కాన్పుల వరకు మగబిడ్డ కోసం చూసి అది ఫలించడంతో ఇక చాలనుకుని కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోవాలని భావించింది. ఆరోగ్య కార్యకర్తలు ఇంటికి వచ్చి భర్త కు.ని ఆపరేషన్ చేయించుకుంటే మేలని వివరించారు. ఇద్దరూ అందుకు ఒప్పుకున్నారు. కానీ కుటుంబ పెద్దలు దీనికి అడ్డుచెప్పారు. మగాడు బయట తిరుగుతాడు. వాడికి శక్తి ఉండొద్దా అంటూ ఎత్తి పొడిచి ఆమెకే ఆపరేషన్ చేయించారు.



కర్నూలు(హాస్పిటల్): పిల్లలు గాకుండా ఉండాలంటే మహిళలకే ఆపరేషన్ చేయించాలనేది సమాజంలో ఏళ్లగా స్థిరపడిపోయింది. పురుషులు కూడా వేసక్టమీ ఆపరేషన్ చేయించుకోవచ్చని, ఎలాంటి ఇబ్బందీ ఉండదని వైద్యులు చెబుతున్నా లైంగిక సామర్థ్యం తగ్గిపోతుందనే అపోహలతో మగాళ్లు వెనకడుగు వేస్తున్నారు. అక్కడక్కడా ఏడాదికి ఒక్కరో ఇద్దరో అంగీకరిస్తున్నా పెద్దగా ఫలితం లేకుండా పోతోంది.

పురుషులకు వేసక్టమీ..

కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స మహిళలు, పురుషులు చేయించుకోవచ్చు. మహిళలకు చేసే ఆపరేషన్‌ను ట్యూబెక్టమీ అంటారు. స్త్రీ ప్రత్యుత్పత్తి వ్యవస్థకు సంబంధించిన ఫాలోపియన్ నాలాలను రెండు వైపులా కత్తిరించి ముడి వేస్తారు. పురుషులకు చేసేదాన్ని వేసక్టమీ అంటారు. వీర్యం ప్రయాణించే వాహికను కట్ చేసి, ఆ మార్గాన్ని మూసి వేస్తారు. దీనివల్ల లైంగిక శక్తి ఏ మాత్రం తగ్గదు. కానీ పిల్లలు వద్దనుకున్న పురుషులు మాత్రమే చేయించుకోవాలి.

మూడేళ్లలో ఏడుగురు

జిల్లాలో గత ప్రభుత్వంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పూర్తిగా అటకెక్కాయి. మహిళలు చేయించుకునే ట్యూబెక్టమి ఆపరేషన్లకే దిక్కులేదు. వేసక్టమి గురించి అడిగేవారు లేరు. అయితే గత మూడేళ్ల నుంచి పరిస్థితిలో కొద్దిగా మార్పు కనిపిస్తోంది. లక్ష్యంలో 50 శాతంపైగా కు.ని ఆపరేషన్లు చేయించుకుంటున్నారు. గత పదేళ్లలో ఒక్కరు కూడా వేసక్టమి చేయించుకోవడానికి ముందుకు రాని పరిస్థితిలో మూడేళ్లుగా ఏడుగురు మగాళ్లు ఆపరేషన్ చేయించుకోవడం శుభపరిణామం. ఈ పరిస్థితిలో ఇంకా మార్పు రావాల్సిన అవసరం ఉంది. కోత, కుట్లు సమస్య లేదు. రక్తస్రావం జరగదు. ఆపరేషన్ అనంతరం సంసార జీవితానికి ఎలాంటి ఢోకా ఉండదని క్షేత్రస్థాయిలో వైద్యసిబ్బంది ఇంటింటికి వెళ్లి మరింత వివరంగా చెప్పి ఒప్పించాల్సిన అవసరం ఉంది.

లైంగిక శక్తికి ఢోకా లేదు

కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌ను మహిళలే కాదు మగవారు కూడా ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా చేయించుకోవచ్చు. మహిళల కంటే పురుషులకే ఇది చాలా సులభమైన ఆపరేషన్ అని వైద్యులు పేర్కొంటున్నారు. పది నిమిషాల్లో ఆపరేషన్ పూర్తవుతుంది. ఆపరేషన్ తర్వాత రెండు గంటల్లోనే ఇంటికి వెళ్లిపోవచ్చు. అన్ని రకాల ఆహారాన్ని తీసుకోవచ్చు. ఆపరేషన్ వల్ల ఎలాంటి శారీరక బలహీనత ఏర్పడదు. శక్తి, సామర్థ్యాలు ఏ మాత్రం కోల్పోరు. సంసార జీవితానికి (లైంగిక శక్తికి)ఎలాంటి ఢోకా ఉండదు. వేసక్టమి తర్వాత అవసరమైనప్పుడు పిల్లలు కావాలనుకున్నప్పుడు రీకెనలైజేషన్ చేయించుకుని పిల్లలు కనవచ్చు.

నాలుగేళ్లుగా కు.ని ఆపరేషన్లు

	సంవత్సరం	లక్ష్యం	సాధన	వేసక్టమి
ఉమ్మడి జిల్లా	2019-20	25,000	16,556	0
	2020-21	25,000	7,728	1
కర్నూలు జిల్లా	2021-22	14,058	7,575	4
	2022-23	13,563	9,730	2

ఇప్పుడిప్పుడే పురుషులు ముందుకు వస్తున్నారు



మగవారు కూడా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోవాలని క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. పలు అపోహలు, అనుమానాలతో చాలా మంది మగాళ్లు వేసక్టమి ఆపరేషన్ చేయించుకోవడానికి ముందుకు రావడం లేదు. మహిళలు, కుటుంబసభ్యులు సైతం ఇందుకు ఒప్పుకోవడం లేదు. అయితే ఇప్పుడిప్పుడే పరిస్థితిలో కొంత మార్పు కనిపిస్తోంది. మూడేళ్లలో ఏడుగురు వేసక్టమి ఆపరేషన్ చేయించుకోవడం శుభపరిణామం.

– డాక్టర్ బి.రామగిడ్డయ్య, డీఎంహెచ్‌ఓ, కర్నూలు

చెక్‌పోస్టులలో నిఘా కట్టుదిట్టం చేయండి


పంచలింగాల చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

కర్నూలు: జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘా కట్టుదిట్టం చేసి పొరుగు రాష్ట్రాల మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రాష్ట్ర డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా గురువారం ఆయన కర్నూలు, కోడుమూరు సెబ్ స్టేషన్లతో పాటు కర్నూలు మండలం పంచలింగాల, సుంకేసుల చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక, తెలంగాణ మద్యం జిల్లాలోకి రాకుండా అడ్డుకోవాలన్నారు. ఆయా చెక్‌పోస్టులలో రికార్డులను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. చెక్‌పోస్టుల నుంచి వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. కర్నూలు ఏఈఎస్ రాజశేఖర్ గౌడ్, పంచలింగాల చెక్‌పోస్టు సీఐ శేషాచలం, కర్నూలు స్టేషన్ ఇన్‌చార్జి సీఐ ప్రసాదరావు, ఎస్‌ఐలు అన్వేష్, సునిల్‌కుమార్, స్వామినాథన్, శ్రీధర్‌రావు తదితరులు డిప్యూటీ కమిషనర్ వెంట ఉన్నారు.

మార్కెటింగ్ శాఖకు రూ.9.39 కోట్ల ఆదాయం

కర్నూలు(అగ్రికల్చర్): వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ మార్కెటింగ్ శాఖకు 20232-24 సంవత్సరానికి ఆదాయం గణనీయంగా పెరిగింది. రైతుల నుంచి వ్యాపారులు, మిల్లర్లు కొనుగోలు చేసిన వ్యవసాయ ఉత్పత్తులపై ఒక్క శాతం మార్కెట్ కమిటీలకు ఫీజు చెల్లించాల్సి ఉంది. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు జిల్లాలోని మార్కెట్ కమిటీలకు వచ్చిన ఆదాయాన్ని పరిశీలిస్తే 2022-23 కంటే పెరిగినట్లు స్పష్టమవుతోంది. ఏడాదికి సంబంధించి రూ.30.85 కోట్లు ఫీజు రూపంలో మార్కెట్ కమిటీలకు రావాల్సి ఉంది. మొదటి ఐదు నెలల్లో రూ.9.39 కోట్లు ఆదాయం వచ్చింది. గత ఏడాది ఇదే సమయానికి రూ.6.69 కోట్లు మాత్రమే వచ్చింది. ఆగస్టు నెలలో రూ.1.22 కోట్ల ఆదాయం లక్ష్యం కాగా రూ.1.91 కోట్లు లభించింది. కోడుమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి గత ఏడాదితో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి ఐదు నెలల్లో రూ.9.58 లక్షల ఆదాయం తగ్గింది. మిగిలిన కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ, మంత్రాలయం మార్కెట్‌లకు గత ఏడాదితో పోలిస్తే ఆదాయం పెరిగింది.

కాణిపాకం వినాయకుడికి మల్లన్న పట్టు వస్త్రాలు


శ్రీవరసిద్ధి వినాయకస్వామికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న శ్రీశైలం ఈఓ లవన్న, అధికారులు, అర్చకులు

శ్రీశైలం టెంపుల్: కాణిపాకంలో వెలిసిన వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించారు. గురువారం శ్రీశైల దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎస్ లవన్న, ధర్మకర్తల మండలి సభ్యులు విజయలక్ష్మి, ఏఈఓ మోహన్, అర్చకులు పట్టువస్త్రాలతో కాణిపాకం చేరుకుని శాస్త్రోక్తంగా పూజాదికాలు నిర్వహించి పట్టు వస్త్రాలు సమర్పించారు. ముందుగా ఆలయ ప్రధాన ద్వారం వద్ద శ్రీశైల దేవస్థానం ఈఓకు కాణిపాక దేవస్థాన చైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేష్, ఏఈఓ కృష్ణారెడ్డి, పర్యవేక్షకులు కోదండపాణి, వాసు ప్రత్యేకంగా ఆహ్వానం పలికారు. అనంతరం మేళతాళాలతో స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి పూజాధికాలు జరిపారు. ఆలయ సంస్కృతి సంప్రదాయాలను దృష్టిలో ఉంచుకుని ఏటా వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాల సమయంలో శ్రీశైల దేవస్థానం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ నెల 18న ప్రారంభమైన కాణిపాక బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 8వ తేదీతో ముగుస్తాయి. చివరగా శ్రీశైలదేవస్థాన అధికారులను కాణిపాక దేవస్థానం ఈఓ, అర్చకులు, వేదపండితులు వేదాశీర్వచనముతో సత్కరించారు.

వలంటీర్ దారుణ హత్య


హరిబాబు (ఫైల్)


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐలు విక్రమసింహ, శ్రీనివాసనాయక్

ఆదోని టౌన్: గుర్తు తెలియని దుండగుల చేతిలో వలంటీర్ దారుణహత్యకు గురైన ఘటన పట్టణంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండిగిరి గ్రామ పంచాయతీ పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన ఈరమ్మ కుమారుడు హరిబాబు(23) భరత్ నగర్ వలంటీర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి 11 గంటల వరకు వినాయక విగ్రహ మండపాల వద్ద ఉన్న హరిబాబు ఆ తర్వాత ఇంటికెళ్లి నిద్రకు ఉపక్రమించాడు. మధ్యరాత్రి 12 గంటల సమయంలో ఫోన్ రావడంతో బయటకు వెళ్లి ఎంతకూ తిరిగి రాలేదు. తెల్లవారుజామున ఈరమ్మ నిద్రలేచి చూడగా కుమారుడు కనిపించక పోవడంతో ఇరుగుపొరుగు వారిని విచారించి బంధువులకు సమాచారం ఇచ్చింది. అందరూ కలిసి వెతుకుతుండగా సమీపంలోని మారెమ్మవ్వ గుడి పక్కన రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉన్నాడని తెలిసి అక్కడకు చేరుకుని తల్లి గుండెలు బాదుకుంది. విషయం తెలుసుకున్న డీఎస్పీ శివనారాయణస్వామి, సీఐలు విక్రమసింహా, శ్రీనివాసనాయక్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. తలపై మారుణాయుధాలతో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఘటనా స్థలంలో మృతుడి సెల్ ఫోన్, ఆనవాళ్లను సేకరించి, కర్నూలు నుంచి డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. తల్లి, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని, త్వరలోనే హంతకులను పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు.

నేనెట్టా బతికేది నాయనా..

హత్యకు గురైన కుమారుడు హరిబాబు మృతదేహంపై పడి తల్లి ఈరమ్మ రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. భర్త పదేళ్ల క్రితమే అనారోగ్యంతో మృతిచెందడంతో కొడుకే లోకంగా బతికేది. వలంటీర్‌గా సేవలందిస్తూ ప్రజల మన్ననలు పొందుతుండటం చూసి పొంగిపోయేది. హఠాత్తుగా హత్యకు గురికావడంతో 'నేనెట్టా బతకాలి నాయనా' అంటూ గుండెలు బాదుకుంది.

ఇక మార్కెట్ యార్డుల్లో మల్టీ గ్రేడింగ్ మిషన్‌లు


మిషన్ పనితీరును పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): దిగుబడులకు గిట్టుబాటు ధర లభించాలంటే గ్రేడింగ్ తప్పనిసరి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం మార్కెట్ యార్డుల్లోనే పండించిన పంటలను గ్రేడింగ్ చేసుకునే సదుపాయం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 15 వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉండగా.. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో మాత్రమే వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు కొనసాగుతున్నాయి. ఈ మూడు మార్కెట్‌లకు ప్రభుత్వం మల్టీ గ్రేడింగ్ మిషన్‌లను సరఫరా చేసింది.

- కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు సరఫరా చేసిన మల్టీ గ్రేడింగ్ మిషన్ రైతులకు అందుబాటులోకి వచ్చింది.
- మిషన్ ద్వారా కందులు, శనగలు, మినుములు, వాము, చిరుధాన్యాల పంటలను గ్రేడింగ్ చేసుకోవచ్చు.
- మల్టీ గ్రేడింగ్ మిషన్ పనితీరును పరిశీలించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటైంది.
- ఇందులో మార్కెటింగ్ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు, జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణ మూర్తి, మార్కెటింగ్ శాఖ డీఇ సుబ్బారెడ్డి, మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు ఉన్నారు.
- వీరి పర్యవేక్షణలో గురువారం మల్టీగ్రేడింగ్ మిషన్ పనితీరు పరిశీలించారు.
- పప్పుదినుసులతో పాటు వామును కూడా గ్రేడింగ్ చేశారు.
- ఈ మిషన్ పూర్తి ధర రూ.52 లక్షలు కాగా.. రూ.29 లక్షలు మార్కెట్ కమిటీ భరిస్తుంది. మిగిలిన మొత్తాన్ని కేంద్రం సబ్సిడీగా ఇస్తుందని మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు తెలిపారు.

29 నుంచి సాయి హాస్టల్‌కు ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలోని యానాంలో ఉన్న స్పోర్ట్స్ అథారిటీ ఇండియా (సాయి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ శిక్షణ కేంద్రంలో ప్రవేశాలకు ఈనెల 29, 30 తేదీల్లో వివిధ క్రీడాంశంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జ్ జి.లింగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి బాడ్మింటన్, స్విమ్మింగ్, వాలీబాల్ క్రీడాంశల్లో ఎంపికైన బాల బాలికలకు రెసిడెన్సియల్, నాన్ రెసిడెన్షియల్ సౌకర్యం ఉంటుందన్నారు. ఈ ఎంపిక పోటీలు యానాంలో ఉన్న డాక్టర్ వైఎస్ఆర్ అంతర్జాతీయ ఇండోర్ స్టేడియంలోని జీఎంసీ, బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2006 ఏప్రిల్ 1వ తేదీ తరువాత జన్మించిన, 12 నుంచి 18 ఏళ్లలోపు బాల బాలికలు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9490187723 సంప్రదించాలన్నారు.

ఎస్‌ఐ మెయిన్ పరీక్షకు 487 మంది ఎంపిక


ఎస్‌ఐ అభ్యర్థుల పరుగు పరీక్షను పర్యవేక్షిస్తున్న డీఐజీ, ఎస్పీ

కర్నూలు: రాయలసీమ జోన్‌కు సంబంధించి ఎస్‌ఐ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన పురుష, మహిళా అభ్యర్థులకు కర్నూలు ఏపీఎస్పీ రెండవ పటాలంలో 20వ రోజు దేహదారుఢ్య పరీక్షలు జరిగాయి. కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్, ఎస్పీ కృష్ణకాంత్, సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణకుమార్ పర్యవేక్షణలో గురువారం జరిగిన దేహదారుఢ్య పరీక్షలకు 855 మంది పురుష అభ్యర్థులు, 231 మంది మహిళా అభ్యర్థులు హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్ల పరిశీలన తర్వాత బయోమెట్రిక్, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం శారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహించగా 1,600 మీటర్ల పరుగులో 662 మంది, 100 మీటర్ల పరుగులో 290 మంది, లాంగ్‌జంప్‌లో 454 మంది ప్రతిభ కనపరచి అర్హత సాధించారు. అన్ని ఈవెంట్లలో ప్రతిభను కనపరచి 487 మంది అభ్యర్థులు ఎస్‌ఐ మెయిన్ పరీక్షకు అర్హత సాధించారు.

నేడు కోడుమూరులో 'జగనన్నకు చెబుదాం -స్పందన'

కర్నూలు(సెంట్రల్): ప్రతి బుధవారం, శుక్రవారం మండల స్థాయిలో ఏర్పాటు చేస్తున్న జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమం ఈ శుక్రవారం కోడుమూరులో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కోడుమూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జిల్లా ఉన్నతాధికారులు హాజరై ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా సలీమ్‌బాషా

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఎస్.సలీమ్‌బాషాను డిప్యుటేషన్‌పై నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీరాజ్ శాఖలో డీఎల్‌డీఓ అయిన సలీమ్‌బాషా జిల్లా నీటియాజమాన్య సంస్థలో అడిషనల్ పీడీ(వాటర్‌షెడ్)గా పనిచేస్తున్నారు. ఈయనను డీఆర్‌డీఏ పీడీగా నియమిస్తూ పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బి.రాజశేఖర్ జీఓ ఆర్‌టీ నంబరు 553 జారీ చేశారు. ఒకటి, రెండు రోజుల్లో సెర్ప్ సీఈఓ నుంచి ఉత్తర్వులు జారీ కానున్నాయి.

కామ్రేడ్‌ల అత్యుత్సాహం..!

- చెరువులన్నింటికీ నీరు నిండేందుకు పట్టే సమయం 90 రోజులు
- రెండు రోజులకే ఫొటోలకు ఫోజులిస్తూ అప్పుడే ఎర్రజెండాలతో కామ్రేడ్‌ల హడావుడి
- ఉనికి కోసం తాపత్రయం

పత్తికొండ రూరల్: డోన్, పత్తికొండ నియోజకవర్గాల పరిధిలోని 77 చెరువులకు నీరు మళ్లించే పథకాన్ని ఈనెల 19న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. మొత్తం చెరువులకు నీరు నిండేందుకు 90 రోజుల సమయం పట్టనుంది. బీడు భూముల్లో సిరులు పండించేలా చేసిన బృహత్తర పథకాన్ని మెచ్చుకోవాల్సిందిపోయి ప్రభుత్వాన్ని విమర్శించడమే ధ్యేయంగా కామ్రేడ్‌లు పథకం ప్రారంభించి రెండు రోజులు కూడా గడవక ముందే గురువారం అత్యుత్సాహం ప్రదర్శించారు. ఏకధాటిగా వర్షాలు కురిసినా ఒక్కోసారి చెరువులు నిండవు. ఇంట్లో వాడుకునేందుకు నీళ్లు ఖాళీ అయితే సింటెక్స్ ట్యాంకు నిండేందుకు సుమారు 2 నుంచి 3 గంటల సమయం పడుతుంది. అలాంటిది చెరువులు నింపడమంటే ఏమనుకున్నారో మరి ఈ కమ్యూనిస్టులు. చందోలి, తుగ్గలి మండలం ముక్కెళ్ల, మారెళ్ల, బొందిమడుగుల, ఆర్ఎస్ పెండేకల్, రాంపల్లి, చెన్నంపల్లి, పగిడిరాయి, జొన్నగిరి, తుగ్గలి, రాతన గ్రామాల్లో ఉన్న చెరువుల వద్ద తమ ఉనికి చాటుకునేందుకు సీపీఐ ప్రతినిధి బృందం ఎర్రజెండాలు పట్టుకుని ఫొటోలకు ఫోజులిస్తూ ఇంకా చెరువులకు నీరు చేరుకోలేదని మీడియా ప్రకటనలతో అప్పుడే లేనిపోని హడావుడి చేయడం చూసి ఆయా గ్రామాల ప్రజలు నవ్వుకున్నారు.

పథకం పనితీరు ఇలా..

నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం సుమారు రూ.150 కోట్ల మేర వెచ్చించి చేపట్టిన భారీ ప్రాజెక్టు ద్వారా ఆలంకొండ సమీపంలోని పంపింగ్ స్టేషన్‌లో 3,800 హెచ్‌పీ సామర్థ్యం నీటి మోటార్లు ఏర్పాటు చేశారు. దీని ద్వారా 5,625 కిలోమీటర్ల మెయిన్ పైపులైన్ ద్వారా 116 మీటర్ల ఎత్తున కటారుకొండ పంచాయతీలోని పులిచెర్ల సమీపంలో కొండపై డెలివరీ చాంబర్‌కు నీళ్లు వెళ్తాయి. అక్కడి నుంచి ఎత్తిపోతల ద్వారా మూడు పైపుల ద్వారా చెరువులకు నీళ్లు మళ్లింపు జరుగుతుంది. 10,394 ఎకరాలకు అధికారికంగా సాగునీరు అందుతుంది. మొత్తం పైపులైన్‌లు, గ్రావిటీ ద్వారా 77 చెరువులకు నీరు నింపేందుకు 90 రోజులు సమయం పడుతున్నట్లు అధికారిక అంచనా. ఎక్కడైతే అత్యవసరం ఉందో సమీపంలోని వాల్‌క్లోజ్ చేసి ఆ చెరువుకు నీరు నింపే సౌలభ్యంగా పైప్‌లైన్ ఏర్పాటు జరిగింది. మొత్తం చెరువులకు నీరు చేరితే ఆయా చెరువుల ఆయకట్టుతో పాటు సుమారు 75 గ్రామాల్లో తాగునీటి శాశ్వత సమస్యకు పరిష్కారం లభించనుంది.

మైనింగ్ అధికారుల సోదాలు

- ఇద్దరిపై కేసు నమోదు

కర్నూలు (న్యూసిటీ): తుగ్గలి మండలం బొందిమడుగుల గ్రామం సర్వే నంబర్ 589లో అక్రమంగా గ్రావెల్ క్వారీ నిర్వహిస్తున్నారనే సమాచారంతో గురువారం జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, విజిలెన్స్ అసిస్టెంట్ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి సోదాలు నిర్వహించారు. మట్టిని తవ్వుతున్న హిటాచీ, కంప్రెషర్, రెండు జాకీలను సీజ్ చేసి తుగ్గలి పోలీసు స్టేషన్‌కు తరలించారు. కూలీలతో మట్టిని తవ్వించి అనంతపురం జిల్లా తాడిపత్రికి తరలిస్తున్నట్లు డోన్‌కు చెందిన రత్నం, చిన్నరాముడు అంగీకరించడంతో వారిపై కేసు నమోదు చేయించామని, భూమిలో ఎంత మేర మట్టి తవ్వారనేది విచారించి జరిమానా విధిస్తామని డీడీ రాజశేఖర్ తెలిపారు.